# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో 50 సంవత్సరాల వయస్సు నిండిన చేనేత కార్మికులకు పింఛన్ అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.
- తల్లిపాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు.
- అమరావతిలో గ్రీన్ హౌస్ భవనాలను నిర్మిస్తున్నామని మంత్రి పి.నారాయణ తెలిపారు.
- ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) నాలుగవ సీజన్ విశాఖపట్నం వేదికగా రేపటి నుంచి మొదలుకానుంది.

==============================

చేనేత కార్మికులకు 50 సంవత్సరాల వయసు నుంచే పింఛన్ అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ రోజు జరిగిన 11వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నేత కార్మికులు చిన్న వయసులోనే అనారోగ్యాల బారినపడుతున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. చేనేత మరమగ్గాలకు 50 శాతం రాయితీతో 80 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ నెల నుంచే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

రాజధాని అమరావతిలో చేనేత వస్త్ర వైభవాన్ని చాటిచెప్పేలా ఒక ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, ఎస్.సవితతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, చేనేత సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

==============================

తల్లిపాలలో అనేక పోషకాలతో పాటు విటమిన్లు ఉంటాయని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో ఈ రోజు జరిగిన అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల

ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తల్లి పాల వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని చెప్పారు. పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో సుమారు 55,607 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, అందులో చదువుతున్న పిల్లలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి వివరించాలన్నారు. రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా సాధారణ ప్రసవాలలో మొదటి స్థానంలో ఉందని మంత్రి వెల్లడించారు.

==============================

అమరావతిలో గ్రీన్ హౌస్ భవనాలను నిర్మిస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. విజయవాడలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) - CII ఆధ్వర్యంలో ఈ రోజు జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... IGBC సర్టిఫికేషన్ ఉండే భవనాలకు మరిన్ని రాయితీలు ఇస్తున్నామని చెప్పారు. గ్రీన్ హౌస్ భవనాలకు పర్మిట్ ఫీజులో 20 శాతం రాయితీతో పాటు డెవలప్ మెంట్ ఛార్జీలను నాలుగు వాయిదాల్లో చెల్లించేలా ఇప్పటికే అవకాశం ఇచ్చామని మంత్రి తెలిపారు. గ్రీన్ ఎనర్జీకి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ని డంపింగ్ యార్డ్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని నారాయణ వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

==============================

యూరియా సరఫరా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి బీ.సీ. జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన మేర యూరియాను అందిస్తామని తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో యూరియా కృత్రిమ కొరతపై వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కృత్రిమ కొరతను నివారించేందుకు రైతులకు అవసరం మేరకే యూరియాను సరఫరా చేయాలని అధికారులను కోరారు.

==============================

ఆత్మనిర్భర్ భారత్ నినాదంతో దేశం మంచి పురోగతి సాధిస్తోందని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. విజయవాడలో జరిగిన ఒక ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రానున్న కాలంలో భారత్ మరింత శక్తిమంతమైన దేశంగా అవతరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. యువత దేశానికి అపారమైన సంపద అని వ్యాఖ్యానించారు. మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దిశగా దేశీయ పరిశోధనలు ఉండాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు.

విరామం

==============================

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఐక్యతా భావనను పెంపొందించేందుకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొని తమ తమ ఇళ్ళపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. అదే విధంగా తిరంగా రంగోలి, తిరంగా బైక్ ర్యాలీ, తిరంగా రాఖీ తయారీ వంటి కార్యక్రమాల్లో భాగమవ్వాలని కోరింది. భారత జాతి గర్వాన్ని ప్రకాశించే జాతీయ పతాకంతో తీసుకున్న సెల్ఫీ చిత్రాల ఆనందాన్ని www.harghartiranga.com వెబ్‌సైట్‌లో పంచుకోవాలని సూచించింది.

==============================

విశాఖపట్నంలోని ఫిషింగ్ హార్బర్ సమీపంలో ఈ రోజు సాయంత్రం గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటన సంభవించింది. స్థానికంగా ఉన్న ఒక స్క్రాప్ దుకాణంలో సిలిండర్ పేలడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారని స్థానిక పోలీసు అధికారులు తెలిపారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలవడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

==============================

స్వర్ణాంధ్ర పి-4 ఫౌండేషన్, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు వంటి అంశాలపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జిల్లా కలెక్టర్లతో ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు. ముఖ్యమైన ప్రాజెక్టులకు సంబంధించిన భూ సంబంధిత అంశాలపై ఆయన ఆయా జిల్లాల కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్, ఐటి శాఖ కార్యదర్శి కె.భాస్కర్, ఆర్థిక శాఖ కార్యదర్శి వినయ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

==============================

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను వినియోగించి ప్రోత్సహించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని అచ్యుతాపురం మండల కేంద్రంలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చేనేత సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని అభివర్ణించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా నిలిచిన ఈ రంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు.

==============================

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ఈ రోజు ఆయన మాట్లాడుతూ... ఈనెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం స్థానికంగా జరుగుతుందన్నారు. గిరిజన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

==============================

ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) నాలుగవ సీజన్ విశాఖపట్నం వేదికగా రేపటి నుంచి మొదలుకానుంది. విశాఖలోని ఏసీఏ వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ ప్రారంభ కార్యక్రమానికి పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని ఏపీఎల్ ఛైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు తెలిపారు. సినీ నటుడు వెంకటేశ్ ఏపీఎల్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ సీజన్ లో అండర్-16 క్రీడాకారులకూ అవకాశం కల్పించామన్నారు. ఈ టోర్నమెంట్‌లో 7 జట్లు పోటీపడనున్నాయని పేర్కొన్నారు.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 80,544 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరకు 79 పాయింట్ల లాభంతో 80,623 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 22 పాయింట్ల లాభంతో 24,596 వద్ద ముగిసింది.

==============================

కర్ణాటక నుండి దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతాల వరకు దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక, దక్షిణ రాయలసీమ, ఉత్తర తమిళనాడు మీదుగా ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాబోయే రెండు రోజులు కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం అధికారి కరుణాసాగర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

==============================

==============================